
# రాజకీయ హంస



విశ్వనాథం టౌన్-కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలలో అధ్యక్ష పదవికి పోటీచేస్తున్నాడని విన్నపుడు నాకు చాలా ఆశ్చర్యం కలిగింది.

విశ్వనాథం ఉన్నవాడు. మనసు ఉన్నవాడు. వయసు ఉన్నవాడు. చదువు సంస్కారం ఉన్నవాడు. పదిమంది సానుభూతిని సంపాదించినవాడు. ఇటువంటి ఎన్ని పదవులకైనా పోటీ చేయగల స్థితి స్తోమత అర్హతలున్నవాడు. అయితే ఎప్పుడైనా పొరబాటుగా అయినా ఎన్నికలు..పదవుల ప్రసక్తివస్తే– "పదిమందికి సాయపడడానికి లేదా సేవచేయడానికి పదవులే కావాలా? ఈపదవీ వ్యామోహం ఉందే?– అయ్యయ్యో! వద్దుబాబూ వద్దు. అది శారీరకంగా వందమందిని దగ్గరచేర్చినా వెయ్యిమందిని మానసికంగా దూరం చేస్తుంది. ఈ రాజకీయాల గొడవలు మనకెందుకు? మనం ఉన్నాం. మనంచేస్తున్న వ్యాపారం ఉంది. దానిని సవ్యంగా నిర్వహించుకుంటే చాలు!" అంటూ రెండు చేతులెత్తి దణ్ణం పెట్టేవాడు. అటువంటి వ్యక్తి సరాసరి బ్యాంక్ అధ్యక్ష పదవికే తలపడ్డాడంటే ఆశ్చర్యం కలగదా మరి?–

ఆశ్చర్యం కలిగింది. అంతకుమించి ఆనందం కలిగింది.

ఆనందం కలిగిందంటే?- అతగాడు బ్యాంక్ అధ్యక్షుడైతే అంతోయింతో అప్పు పుట్టుతుందని కాదు. అతడి కాళ్ళావేళ్ళాపడి నలుగురి పిల్లల్లో ఎవరికో ఒకరికి ఒక ఉద్యోగం వేయించుకోవచ్చని కాదు. కనీసం బ్యాంక్ అధ్యక్షుడు 'నావాడు!' అని చెప్పుకొంటూ రొమ్ము విరుచుకొని తిరుగుదామన్న అల్పసంతోషమూ కాదు.

మరి ఎందుకంటే?

ఋణము తీర్చుకొనే అవకాశం కలిగినందుకు!

ఋణం తీర్చుకోవడం? మనిషి ప్రయత్నిస్తే ఋణవిముక్తుడు కావచ్చు.

కానీ ఋణం తీర్చుకోవడమంటే మాటలా? అందుకేనేమో? చర్మాన్ని వొలిచి చెప్పులు కుట్టిచ్చినా ఋణం తీరదంటారు. అంటే ఋణంతీరే అవకాశమే లేదా?

ఎలా ఉంటుంది?

ఋణపడడం వేరు. ఋణం చేయడంవేరు.

నేను విశ్వనాథం కుటుంబానికి ఎంతో ఋణపడి ఉన్నాను.

విశ్వనాథం తండ్రి వెంకటాచలం. వెంకటాచలం వయస్సులో నాకంటే మూడు నాలుగేండ్లు పెద్దఅయినా మా ఇద్దరిమధ్య వయోభేదం ఎప్పుడూ అడ్డురాలేదు.

వెంకటాచలం సంపన్నుడు. నేను సామాన్యుడిని. ఈ సామాన్యుడికి ఆ సంపన్నుడికి మధ్య అంతరం హస్తిమశకాంతరం. అయినా ఈ అంతరం మా మైత్రికి ఎప్పుడూ అవాంతరం కాలేదు.

చాలామందికి ఇదొక ప్రశ్నార్థకం!

"వీళ్ళిద్దరి మధ్య ఏం ఉందాదబ్బా? వెంకటాచలం ఎక్కడ? వీడంటే వెంకటాచలానికి ఎందుకింత అభిమానం?" అని చాలామందికి సందేహం!

నాకూ అదే సందేహం.

దరిద్రుణ్ణి చూస్తే ధనవంతుడు దూరంగా తొలగిపోతున్న రోజులివి. ధనవంతులకు ధనవంతుడు ఏడుకొండలవాడు. వాడు కూడా అడుగుతారన్న భయంతోనే ఏడుకొండలకవతల వెలిశాడని కవి చమత్కారం. బంగారం లాంటి ఉద్యోగాన్ని వదులుకొని దరిద్రాన్ని కొని తెచ్చుకొన్న వాడిని నేను. నన్ను చూస్తే జనం తప్పుకొంటున్నారు. కొందరు చూసీచూడనట్లు తలలు వంచుకొంటున్నారు. అటువంటి వాడిమీద వెంకటాచలానికి ఎందుకింత వెర్రి అభిమానం?

"అయ్యో పాపం! ఉన్న ఉద్యోగాన్ని వదలుకొన్నాడే?" అన్న సానుభూతి అనుకొందామంటే నాలాంటి వాళ్ళు సవాలక్షమంది లోకంలో!

పోనీ! సజాతీయుడన్న స్వాభిమానమా? అంటే ఆ అవకాశమే లేదు.

ఇద్దరి మధ్య అడ్డుగోడల్లా రెండు జాతులు. సజాతీయులనిపించుకోవాలంటే నేను రెండు జాతుల్ని అధిగమించాలి. అతడా రెండు జాతుల్ని దాటి కిందికి రావాలి.

అది జరగని పని!

అయితే జరిగింది మాత్రం వాళ్ళిద్దరిదీ ఒకేమాట. ఒకేబాట– అన్న పరిస్థితి.

ఇది ఎలా జరిగిందని అడిగితే–

వేదాంతి దగ్గర ఒక సమాధానం ఉంటుంది. జ్యోతిష్కుడి దగ్గర మరొక సమాధానం ఉంటుంది. మార్క్సిస్ట్ దగ్గర ఒక సమాధానం ఉంటుంది. మామూలు మనిషి దగ్గర వేరొక సమాధానం ఉంటుంది.

నా దగ్గర మాత్రం సరైన సమాధానం లేదు.

ఎలా ఉంటుంది?

నేను కంటపడితే చాలు. ఒకసారి ఎగాదిగా చూస్తాడు. నిశితంగా ముఖకవళికల్ని గమనిస్తాడు. పరిస్థితి పసికట్టతాడు. చేయవలసింది చేస్తాడు. రెండో కంటికి తెలియకుండా చేస్తాడు. పరిస్థితిని ఎలా పసిగట్టాడా? అని ఆశ్చర్యపడడమే మనవంతు అవుతుంది.

లేకపోతే గుడిసెలో వ్యాపారం ఏడంతస్థుల మేడల్లోకి ఎదుగుతుందా?

అతడు మనిషిలో మనిషి.

నా మనస్సులో మనస్సు!

ఇప్పటికీ తలుచుకొంటే కండ్లు వర్షిస్తాయి.

ఉద్యోగం వదలుకొన్నాను. అది అహంకారమో? అజ్ఞానమో? ఆవేశమో? అప్పుడూ తెలియదు. ఇప్పుడూ తెలియదు. ఎప్పుడూ దానిని గురించి ఆలోచించలేదు కాబట్టి.

ఇప్పుడైతే అందరూ ఉద్యోగం వదలి మంచి పనిచేసినాడంటున్నారు కానీ– అప్పుడు? కనిపించిన వాళ్ళందరు కాకులు పొడిచినట్లు పొడిచిన వాళ్ళేకదా?

"వాడికేం పోగాలం వొచ్చిందో? బంగారట్టా ఉద్యోగంవే? వొదులుకోనొచ్చి దానికి వాడికెట్టా మణుసొప్పిందో? పోనీ! తాతముత్తాతలు పెట్టేసి పొయ్న బూంవులు బావులు ఉండాయా? తలదాచుకుండే దానికి జానదు కొంపైనా ఉండాదా? బ్యాంకుల్లో లక్షలకు లక్షలేమైనా మూలగతా ఉండాయా? ఏం జూసుకోని పాటుపణ్ణెట్టు ఆ పిలగాడు?"

ఎవరినోట విందామన్నా ఇదేమాట!

నిజమే కదా? అందరు అన్నట్టు నాదని చెప్పుకోవడానికి నా దగ్గర ఏముంది? ఏమీలేదు. ఉన్నది అయిదు మంది ముగ్గురు పిల్లల్తో కలిసి– తినడానికి.

ఏమీ లేకపోవచ్చు. అయినా నేనూ ఒక మనిషిని. నాకూ కొన్ని అభిప్రాయాలున్నాయి. అభిమానం ఉంది. అభిప్రాయాలు తారుమారై అభిమానం దెబ్బతింటే?–

ఆత్మవంచన చేసుకొని బతకవలసి వస్తుంది.

అది చేతగాకనే కదా ఉద్యోగాన్ని వదులుకోవలసి వచ్చింది.

ఒకవైపు మాత్రమే చూసి విమర్శించిన లోకం మరొకవైపు చూసి ఆలోచించదే?

అందుకే అది లోకమయింది. అది చూడగలిగింది ఒక్కవైపే! మరొకవైపు చూడగలిగిన ఓపిక దానికిఉంటే?– ఈఅన్యాయాలు... అక్రమాలు... హత్యలు.. రక్తపాతాలూ– తావుదొరకక తపిస్తూ ఉండేవి ఏ కొండల్లోనే కోనల్లోనో?–

ఈ లోకంలో ఉద్యోగం సద్యోగం లేని జీవితం!

గడనలేని మగవాడు!– నడపీనుగని నవ్వుతారట.

ఇంటా బయట నడపీనుగనిపించుకొంటున్న రోజులు.

నెలనెలకు అంతో ఇంతో జీతం తెస్తూ ఉంటేనే– తెచ్చిన దానికంటే ఇచ్చుకోవలసిందే ఎక్కువగా ఉండేది. బోడితలకు బొటన వేలికి ముడివేస్తూంటే కాలం గడవనట్లుగా గడిచేది. మరి ఇప్పుడు? పూట ఎలా గడుస్తుంది? అన్న పరిస్థితిలో సంసారం. భగవాన్! పగవాడికి కూడా వద్దురా ఈ పరిస్థితి! అన్న నిట్టూర్పులు. సంసారం గుట్టన్న పరమసత్యాన్ని ఎరిగిన పరమసాధ్వి ఇల్లాలి ఓదార్పులు. నిట్టూర్పుల ఓదార్పులతో కాలంతో పోటీపడ్తూ ఉంది సంసారం.

ఆ సమయంలో అందింది పల్లెలో అన్న చనిపోయాడన్న కపురు.

తగిలిన కాలికే తగలడం. అదే జీవితం!

పోవాలి. తప్పనిసరిగా పోవాలి. భార్యాపిల్లల్తో కలిసి పోవాలి. పోతే?– అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయో? ఏమో? అన్న పోయాడని ఏడవాలో పల్లెకు పోయి దహన సంస్కారాలు ఎలా నిర్వహించాలని ఏడవాలో అర్థంకాని పరిస్థితి.

ఏ పుణ్యాత్ముడు కనిపిస్తాడో? ఏ మహానుభావుడు కనికరిస్తాడో? అని ఆలోచిస్తూ నడుస్తున్నాను.

వెంకటాచలమే ఎదురుపడ్డాడు.

అతనిని చూసి నేను నిలబడ్డాను. నన్ను చూసి ఆయన నిలబడ్డాడు.

ఒకరికి ఎదురుగా ఒకరు.

నాకనుకొలకుల్లో కన్నీళ్ళు!

ఒక్క క్షణం నా మొగంలోకి నిశితంగా చూశాడు.

"ఎవరు చనిపోయింది?"

అనితరసాధ్యమైన గ్రహణశక్తి. అభినందనీయం. అయితే అది సమయమా?

"పల్లెలో అన్న"

మారుమాట్లాడ లేదు. ఆయన జేబులో నూరురూపాయలు నా జేబులో చేరింది.

"వెళ్ళి పనిచూసుకొనిరా!" అన్నాడు.

నేను ఇల్లు చేరేసరికి ఇంటి ముందర కారు ఉంది.

అప్పుడు 'బోరో' మని ఏడ్చాను. అన్న చనిపోయినాడని కాదు. ఈ లోకంలో ఇంకా మంచితనం బతికి ఉందే! అని.

ఆ రోజుల్లో నూరు రూపాయలు... కారు చాలా అపురూపమైన విషయాలు!

ఇలా ఎన్నెన్ని సందర్భాలో... ఎన్నెన్ని విధాలుగానో తానుచేసిన సహాయాలు ఒక ఎత్తయితే- నన్ను నా కాళ్ళమీద నిలబెట్టడానికి చేసిన ప్రయత్నం? మరొకరు మరొకరైతే ఆలోచనకేరాదు. ఆలోచన కలిగినా ఆచరణ?- అదే ఉండదు.

అదే వెంకటాచలంలోని ప్రత్యేకత!

చేతిలో డబ్బులు చెలామణి అవుతూ ఉంటే రాగులరాయి తిరుగుతూ ఉంటే రాజ్యమంతా చుట్టాలే అన్నట్టు- చెట్టూ పుట్టకూడా పలకరిస్తాయట!

వెంకటాచలం చేతి వేలి వేలికీ ఉంగరాలు లేవు. అయితే ఆ చేతుల్లో వేలకువేలు చెలామణి అవుతూ ఉంటాయి.

లోకం చాలా తెలివయింది. దానికి మనిషి తెలివి తేటలతో ఏమాత్రం పనిలేదు. నీతి నిజాయితీలతో పనిలేదు. దానిచూపు ఎప్పుడూ డబ్బుమీదే! వెంకటాచలం చేతిలో డబ్బు ఉంది. ఆ డబ్బు మీద లోకంచూపు ఉంది. అందుకే అది వెంకటాచలం చుట్టూ తిరుగుతూ ఉంది.

అయితే వెంకటాచలం నా చుట్టూ తిరిగేవాడు.

కారణం?

ఎంత ఆరా తీసినా లోకానికి అర్థంకాలేదు.

అంతకుముందు నాకూ అర్థంకాలేదు.

మనసారా నవ్వుకోవాలన్నా మనసు విప్పి మాట్లాడుకోవాలన్నా వెంకటాచలానికి ఏకాంతం అవసరం. ఆ ఏకాంతంలో అయస్కాంతం కాంతకాదు. నేను!

ఇతరుల సంగతి ఎలావున్నా ఒక్కొక్కప్పుడు నాకే ఆశ్చర్యం కలిగేది.

అటువంటి ఒకానొక సందర్భంలో-

"ఎంతకాలం ఒళ్ళో చేతులు పెట్టుకొని కూర్చుంటావ్? ఏదైనా వ్యాపారం..." నేను పకపక నవ్వాను.

"ఎందుకు నవ్వుతున్నావే?"

"ఉద్యోగం చేయడానికి చేతకాని వాడిని".

"ఉద్యోగం వేరు. వ్యాపారం వేరు"

"అదెలా?"

"ఉద్యోగంలో స్వేచ్ఛలేదు. వ్యాపారంలో అది ఉంది".

"అయితే వ్యాపారం... ఏం వ్యాపారం?"

"చేయడం ప్రధానం. వ్యాపారం ఏదైనా ఒక్కటే!"

"అయితే ఎంతోమంది వ్యాపారాలు పెడుతున్నారు. నెలలు తిరగకముందే కొంతమంది... ఏడాది తిరగకముందే ఎంతో మంది బోర్డు తిప్పేస్తున్నారు. అచ్చివస్తేనే వ్యాపారం. అందరికీ నీకు జరిగినట్లే జరుగుతుందనుకోవడం పొరబాటు".

"వ్యాపారానికి ప్రాణం మాట. చాలా మందికి ఈ అసలు రహస్యం తెలియదు. వ్యాపారంలో మాట నిలబెట్టుకోగలిగితే అది తప్పక నిన్ను నిలబెడుతుంది".

ఒక శుభ ముహూర్తాన నేను వ్యాపారిని అయ్యాను.

నేను వ్యాపారి కావడంలో వెంకటాచలానికి ఋణపడ్డాను.

మరొక మహానుభావుడి దగ్గర ఋణం చేశాను.

"వ్యాపారం అంటే- అంతా అబద్ధాలే! అయితే ఆ అబద్ధాల్లో కూడా సత్యం ఉంది. నీతి నిజాయితీఉంది. ధర్మంఉంది. వాటివెంట నువ్వునడువు. అవినిన్ను ముందుకు నడిపిస్తాయి. నీతో వ్యాపారం నడుస్తుంది. జాగ్రత్త".

వెంకటాచలం ఎప్పటికప్పుడు నన్ను హెచ్చరిస్తూనే ఉన్నాడు.

అతని మాట ప్రభావం నామీద. ఆ ప్రభావం నా ప్రవర్తనమీద. నా ప్రవర్తన ప్రభావం వ్యాపారం మీద- వ్యాపారం బాగా పుంజుకొనింది.

చేతిలో నాలుగు రూకలు. ఇంట్లో నంజుకోవడానికి నాలుగు రకాల కూరలు. మూడు పూటలు నమ్మకంగా నాలుగు వేళ్ళు నోట్లోకి పోతున్నాయి. అక్కడికి తృప్తి పడితే అది మానవజన్మ ఎలా అవుతుంది? బాడుగ ఇల్లు సొంత ఇల్లు కావాలన్న తపన పుట్టింది.

ఆ ఇల్లు అమ్మకానికి వచ్చింది.

కొన్నాను.

నాకు అప్పుయిచ్చిన వ్యక్తికి ఒళ్ళు రగిలింది.

"ఏంవయ్యా? నువ్వు చేసిన పని సరిపోతుందా? ఉద్యోగం సద్యోగం లేకుండా ఉన్నాడే? ఏదో వ్యాపారం చేసుకొని బతకతాననంటున్నాడే? పోనీలే పాపం! అని ఇస్తే నువ్వు చేసిన పని? చేతికి డబ్బువస్తే చేసిన అప్పు తీర్చాలా? ఇల్లు కొనాలా?" అంటూ ఆ మనిషి నామీద విరుచుకపడ్డాడు.

అతని వాదనలో అర్థంలేదనడానికి వీలులేదు.

అయితే నాకూ ఉంది ఒక వాదన!

"ఆస్తి పాస్థులు లేనప్పుడే అప్పుఇచ్చిన వ్యక్తికి అంతోయింతో ఆస్తి ఏర్పడినప్పుడు భయపడవలసిన అవసరం ఏముంటుంది?" అని.

"అయితే ఆ ఆస్తిని తాకట్టు పెట్టు" అని అతను.

"అనవసరం ఖర్చు ఎందుకు?" అని నేను.

ఫలితంగా నా మీద అరెస్ట్ వారెంటు!

కోర్టు అమీనా నన్ను అరెస్ట్ చేశాడు. కోర్టుకు నడవమన్నాడు. కోర్టు ఎదుట హాజరు పరిచాడు.

"అప్పుకడతావా? కమ్ముల వెనుక కూర్చుంటావా?"

కోర్టు అడిగింది. చాలా మర్యాదగా అడిగింది. అది దాని తప్పుగాదు. అది చట్టం చేతిలో బానిస.

నిలబడి ఆలోచిస్తున్నాను- బోనులో వంచిన తలెత్తకుండా. అంతలోనే ప్రత్యక్షమయ్యాడు. దేవుడి మాదిరి ప్రత్యక్షమయ్యాడు. వెంకటాచలం పైసలతో సహా అప్పుచెల్లించాడు.

కోర్టుకు అమీనా వెంట నడిచిపోయాను.

కోర్టునుండి కార్లో ఇంటికి తిరిగివచ్చాను.

ఇంట్లో అడుగుపెట్టి మళ్ళీ ఒక్కసారి 'భోరో' మని ఏడ్చాను. నా మీద అరెస్ట్ వారెంట్ వచ్చిందనికాదు. లోకంలో ఇంకా మంచితనం బతికి ఉందే? అని.

వెంకటాచలం నిజమైన స్నేహితుడు.

ఇప్పుడు కీర్తిశేషుడు!

సాక్షాత్తు ఆ కీర్తిశేషుని కుమారుడు విశ్వనాథం.

ఆ విశ్వనాథం టౌన్- కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికల్లో అధ్యక్ష స్థానానికి పోటీ చేస్తున్నాడు.

నా ఆనందానికి ఆకాశమే హద్దు!

"ఉడతా భక్తిగా కాదు. యావత్ శక్తిని వినియోగించాలి. విశ్వనాథాన్ని గెలిపించాలి. అతడిని బ్యాంక్ అధ్యక్షుడి స్థానంలో చూడాలి. ఎక్కడ ఉందో? ఏమో? వెంకటాచలం ఆత్మ! ఉంటే- అది సంతోషించాలి." అని నిర్ణయించుకొన్నాను.

ఆలోచన నాది. అనుగ్రహం ఓటర్లది!

ఓటర్ల అనుగ్రహం సంపాదించాలంటే?- అడుగడుగు దండాలు పెట్టాలి. అవసరమైతే వాళ్ళ కాళ్ళయినా పట్టాలి.

వాసుదేవుడు గాడిదకాళ్ళు పట్టాడట!

అందులో స్వార్థం ఉంది.

నా ఆలోచనలో స్వార్థంలేదు. కృతజ్ఞతాభావానికి మించి అర్హుడికి అధికారాన్ని కట్టబెట్టాలన్న తపన ఉంది.

కలంచేతికి అందుకొన్నాను. గళం సవరించుకొన్నాను- ధైర్యంగా ఎన్నికల రణరంగంలో దూకడానికి.

అప్పుడు అద్దం ముందు నిలబడ్డాను.

ఓటర్ని ఆకట్టుకోవడానికి కలము గళమే సరిపోవుగదా?

ఓటరు ఎదుట పడితే నవ్వాలి. ఎలానవ్వితే సహజంగా ఉంటుంది. నవ్వుతూ చేతులు జోడించాలి. ఎలా జోడిస్తే వినయం ఉట్టిపడుతుంది? ఆ చేతుల్తోనే ఓటరు చేతులు పట్టుకోవాలి. ఎలా పట్టుకుంటే పట్టుదొరుకుతుంది? పట్టువిడిపించుకొనకముందే చేతులు కాదు- కాళ్ళనిచెప్పాలి. ఎలా చెప్పితే నమ్మకం కుదురుతుంది? సాధన చేశాను. ఒకటిరెండు దినాలు

డ్రామా రిహార్సల్సు చేసినట్టు చేశాను. నా హావభావాలు ఓటర్ని ఆకట్టుకోగలవన్నంత నమ్మకం కుదిరింది. అప్పుడు సందుగొందుల వెంటపడ్డాను.

ఎదుట పడిన వ్యక్తి బ్యాంకులో మెంబర్ అవునోకాదో? అతని మొగాన రాసిపెట్టి ఉండదు కదా? అతడు మనిషి అని తెలిస్తే చాలు. ఆడా మగా తేడాలేదు. ఎదుటపడితే చాలు. నవ్వుతున్నాను. నమస్కరిస్తున్నాను. చేతులు పట్టుకొంటున్నాను. చేతులు కాదు-కాళ్ళు! అంటున్నాను. 'ఒక్క ఓటు విశ్వనాథానికి!' అని ప్రాథేయపడుతున్నాను.

నా అభ్యర్థన రక్తిగట్టింది.

నా ప్రచారానికి బ్రహ్మాండమైన ఆదరణ లభిస్తూ ఉంది.

"అయ్యయ్యో! నువ్వు ఇంతదూరం చెప్పాలా? విశ్వనాథం అంటే- పెద్దయ్యోరి కొడుకేగదా? పిలగాడు శానామంచోడు. నెత్తీతిత్తీ రొండూ కొట్టేవాళ్లకే ఓట్లేస్తా ఉండేటప్పుడు ఆ పిలగాడి కేసేదానికేఁవుండాది? నువ్వు సెప్పాల్సిన పనేలేదు. నువ్వు పద. టైం వేస్ట్ సెయ్‌బాక".

ఎవరినోట విందామన్నా ఇదే మాట!

ఆ మాటలు వింటూ ఉంటే విశ్వనాథం అధ్యక్షుడైనంత ఆనందం కలుగుతూ ఉంది. ఆ ఆనందంలో కష్టమే తెలియడంలేదు. కాలం తెలియడంలేదు. ఊళ్ళో తిరగని చోటంటూ లేదు. పలకరించని ఓటరంటూ లేదని తిరుగుతున్నాను.

ఎన్నికలు జరగడానికి పట్టుమని పదిరోజులు లేవు.

ప్రచారం మంచి ఊపు అందుకొనింది.

విశ్వనాథం గెలుపుఖాయమని ప్రతినోటా వినిపిస్తూ ఉంది.

ఋణం తీర్చుకొనే అవకాశం సద్వినియోగమవుతున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది.

ప్రత్యర్థి గొంతులో పచ్చి వెలగకాయ పడినట్లయింది.

సరిగ్గా అదే సమయంలో నెత్తిన పిడుగుపడినట్టు పడిందొకవార్త!- టౌన్ కోఆపరేటివ్ బ్యాంక్ ఎన్నికలు ఆరునెలల వరకు వాయిదా పడ్డాయని!

కారణం?

ఒకానొక నాయకుడికి విశ్వనాథం బ్యాంకు అధ్యక్షుడు కావడం ఇష్టంలేదట!

"ఇదేఁవిటిది? విచిత్రాల్లో విచిత్రంగా ఉందే? విశ్వనాథం కాంగ్రెస్ పార్టీవాడే! సదరు నాయకుడు కూడా కాంగ్రెస్ పార్టీవాడే కదా? ఇద్దరూ ఒకపార్టీవాళ్ళే అయినప్పుడు ఒకరికొకరికి పడడం లేదంటే?"...

"నమ్మలేనంటున్నావ్?- మహానుభావా! ఇద్దరు కాంగ్రెస్ పార్టీ వాళ్ళే! కాదనిందెవరు? అయితే విశ్వనాథం నాయకుడి గ్రూపు మనిషికాదట!"

"అదా సంగతి!"

"అదే సంగతి. నాయకుడు ఇక్కడి పరిస్థితిని గమనించాడు. తాను నిలబెట్టిన తన గ్రూపు మనిషికి డిపాజిట్టు కూడా దక్కేటట్టుగాలేదు. అప్పుడేం చెయ్యాలి? ఓటమిని ఎదుర్కోవాలంటే రాజకీయంతోనే ఎదుర్కోవాలి. అందుకే ఎక్కాడు. విమానమే ఎక్కాడు. దిగాడు. హైదరాబాద్‌లోనే దిగాడు. మంత్రి ముందర కూర్చున్నాడు. ఏమి మంత్రించాడో ఏమో పాపం! ఆ మంత్రాల్తో మంత్రి కొంచెం సేపు వెనక్కుముందుకు ఊగులాడి ఊఁ! అని ఉంటాడు. ఇక్కడ అందరి గొంతులకు ఉచ్చులు పడ్డాయి"

"ఇది చాలా అన్యాయం కదా? ఎలక్షన్లు పెట్టేదివాళ్ళే! వద్దనేది వాళ్ళేనా? ఎలక్షన్లనే కుందికి బ్యాంకికి ఎంత ఖర్చు? పోటీ చేస్తున్న వాళ్ళకెంత ఖర్చు?"

"ఎవరికెంత ఖర్చయినా మాటచెప్పడానికి మంత్రి గారికేం ఖర్చు?"

ధర్మాధర్మాల చర్చల్లో నాలుగ్గాళ్ళమండపం దగ్గర ధర్మం నాలుగు పాదాల మీద నడుస్తూ ఉంది.

అది విని నాలుగ్గాళ్ళ మండపం నవ్వుకొంటుంది!

నాలుగ్గాళ్ళ మండపం నవ్విందంటే– ఊరు నవ్వినట్లే లెక్క!

ఎందుకు నవ్వదు?

ఎలక్షన్లు జరగవని కొందరు... వాయిదా పడిందని కొందరు... వాయిదా పడలేదు పాడూలేదు. ఇది నాయకుడు ఆడుతున్న నాటకమని కొందరు.

ఎలక్షన్లు నిర్ణీతమైన తేదీకే జరగతాయని పందెం కాసేవాళ్ళు కొందరు!

జరిగితే చెవికోసుకొంటానని ప్రతినలు చేసేవాళ్ళు కొందరు!

మొత్తానికి టౌన్ బ్యాంక్ ఎలక్షన్లు నవ్వులాటగా మారింది.

ఊరునవ్వమంటే నవ్వదా మరి?–

ఈ సందిగ్ధావస్థలో ప్రచారం ఊపుతగ్గింది కానీ ఉడిగిపోలేదు. ఎవరికి తోచినట్లు వాళ్ళు.. ఎవరిశక్తి మేరకు వాళ్ళు ఇరుపక్షాలు ప్రచారం చేసుకొంటూనే ఉన్నాయి.

ఒకానొక దినం. కనుచీకటి పడుతున్నవేళ. ప్రచారం చేసుకొంటున్న ఇరుపక్షాలు ఒకేవీధిలో కలుసుకొన్నాయి.

ఇది అనుకోనట్లుగా జరిగింది. జరిగితే ఏముంది? వాళ్ళ ప్రచారం వాళ్ళది. మా ప్రచారం మాది. అయినా విశ్వనాథం–

"దయచేసి మనలో ఎవ్వరు కూడా పల్లెత్తు మాట అనకండి. ఒకవేళ వాళ్ళు నోరుజారినా వినీవిన్నట్లు మన ప్రచారం మనం చేసుకొంటూ పోదాం. అధికారం వాళ్ళ చేతుల్లో ఉంది".

"అధికారం ఉంటే?– పీక్కోమను చూద్దాం!"

"అదే వద్దంటున్నా".

"కద్దంటే? కొంపలు మునిగిపోతాయా? మగతనం ఉంటే రంగంలోకి దిగి దమ్ములుంటే గెలుచుకోమను! పక్కదోవలు... దొడ్డిదోవలు అదీ ఒక మొగతనమేనా? థూ!"

ఎదురు పార్టీవాళ్ళల్లో ఎవడో ఒకడి చెవిని పడనే పడిందీమాట!

"ఏం కూసినావురా నాకొడకా!" అంటూ మీదికి వచ్చాడు.

"కొడకా గిడకా అన్నావంటే తలకాయల్లేచిపోతాయి జాగ్రత్త!"

"లేపరా చూద్దాం! నీ మొకాన మీసాలుంటే ఎన్ని తలకాయలు లేపతావో లేపరా చూద్దాం!"

విశ్వనాథం ఒకవైపు. నేనొకవైపు వారిస్తూ ఉన్నాం. మా మాటలు చెవుల్లోపడితే కదా? మాటకు మాట!– చినికి చినికి గాలి వానగా తయారయింది.

కొందరి చేతుల్లో స్ప్రింగ్ కత్తులున్నాయి. కొందరి చేతుల్లో నాటుబాంబులున్నాయి.

ఊహించనే లేదు. ఎన్నికల ప్రచారంలో ఇదంతా ఒక భాగమేమో?–

చూస్తూ చూస్తూ ఉండగానే ఎన్నికల రంగం రణరంగంగా మారిపోయింది.

సోడాబుడ్లు పగులుతున్నాయి. కత్తులు మెరుస్తున్నాయి.

ఈ బీభత్సాన్ని చూడలేక వీధి జనం తలుపులు బిగించుకొన్నారు.

"లేపరా చూద్దాం! ఎన్ని తలకాయలు లేపతావో చూద్దాం!" అన్న వాడి తలలేచిపోలేదు కానీ పన్నెండు కత్తిపోట్లతో ప్రాణం లేచిపోయింది.

ఎటు చూసినా హాహాకారాలు. ఎమైనారో? ఎటువాళ్ళటు అయిపులేకుండా పారి పోయారు. క్షణాల్లో బీభత్సాన్ని సృష్టించిన వీధి నిర్మానుష్యమయి పోయింది.

నాయకుడి చేతిలో అధికారం ఉంది. అధికారానికి అడుగులకు మడుగులొత్తుతారు అధికారులు– న్యాయాన్ని అరమట్టు కిందికి అణగదొక్కి!

విశ్వనాథం అరెస్ట్ అయ్యాడు.

ఇప్పుడేం చేయాలి?– టౌన్‌బ్యాంక్ ఎన్నికలు ఏఏట్లో అయినా పోయి కలవనీ– ముందు విశ్వనాథాన్ని విడిపించాలి. విడిపించాలంటే అధికారానికి అడ్డునిలబడాలి. ఆశక్తి ఎవరికి ఉంది. మళ్ళీ అధికారానికే ఉంది. అంటే అధికారాన్ని అధికారంతోనే జయించాలి.

ఆ అధికారం ఎవరిచేతిలో ఉంది?

నాయకుడి చేతిలో ఉంది. ఆ ఊళ్ళోనే నాయకుడికి నాయకుడంతటి వ్యక్తి మరొక నాయకుడు ఉన్నాడు. అతని చేతిలోనూ ఉంది.

ఇది స్థానిక సమస్య. ఇద్దరూ స్థానిక నాయకులు. నూగులు నూనె ఒక్కటే! గాండ్లవాడే వేరన్నట్టు నాయకులు నాయకులు ఎప్పుడూ ఒక్కటే!– ఆ నాయకుని కాదని అతడు నా పక్షాన నిలబడతాడా?

ఎందుకు నిలబడడు?

నేను అతని అభిమానిని. అభిమానమంటే అది వెలకట్టలేని అభిమానం కావచ్చు. కానీ అతని మీద వెలకట్టలేని అభిమానం ఉన్నంతమాత్రాన అతనికి నామీద ఉండవద్దా?

ఎందుకు ఉండదు?

అతడు నాయకుడు కావడానికి నేను పడిన శ్రమ?

తలచుకొంటే ఇప్పటికీ గుండెలు జలదరిస్తాయి!

ఇక్కడికి సుమారు ఇరవై కిలోమీటర్ల దూరాన పల్లె. ఆ పల్లెలో దాదాపు పది వేలకు పైగా ఓటర్లున్నారు. అయితే ఆ పల్లె కుళ్ళిపోయింది. కుళ్ళు కంపుకొడుతూ ఉంది. చదువు సంధ్యలు లేకుండా ఎద్దులగొట్టి ముద్దలు తినే వెర్రిజనం ఉన్నంతవరకు ఈ కులం వెర్రి ఆ పల్లె దరిదాపులకు కూడా పోలేక పోయింది. ఇప్పుడు సగానికి సగం చదువుకొన్నవాళ్ళు. ఆ పల్లె పూర్తిగా కులం వెర్రితో కుళ్ళిపోయింది. ఆ కంపును కడగడానికి చాలా శ్రమపడవలసి వచ్చింది. పగలంతా ప్రచారం. రాత్రి పూట ఆ పల్లెలో మకాం. ఆ పల్లెను ఒక తాటిమీద నడిపించడానికి నేను చేసిన ఆలోచనలు.... వాడిన విస్కీ బాటిల్స్... ఇచ్చిన హామీలు– నాకు కూడా ఇంత రాజకీయం వచ్చా?' అన్న ఆశ్చర్యాన్ని కలిగించింది.

ఒకరోజు రాత్రి దాదాపు అర్ధరాత్రి కావస్తూ ఉంది. ఆ పల్లెలో ముప్పాతిక మువ్వీసం ఓట్లు మనకే అన్న నమ్మకం కుదిరిన తర్వాత బయలుదేరుతున్నాను.

"అన్నా! దినమ్మూ నువ్వే వస్తా ఉండావే? ఒకపూట మన నాయకుణ్ణి కూడా తొడుక్కొని రారాదా? మేము ఆయన్ను చూసినట్టవుతుంది. ఆయన మమ్మల్ని పలకరించినట్టుంటుంది" అని ఎవరో ఒక వ్యక్తి అడిగితే సరేనన్నాను.

ఆ మరుసటి రోజు సాయంకాలమే నాయకుడిని వెంటబెట్టుకొని వెళ్ళాను.

ఊరు ఊరంతా ఒక్కటయింది. నా ప్రయత్నం ఫలించినందుకు నాకు కించిత్ గర్వంగా కూడా ఉంది.

చుక్కల్లో చంద్రుడి మాదిరి నాయకుడు!

నేను ప్రతిరోజు ఆ పల్లెకు పోవడం.. అందరినీ చేర్చడం... ఎవరికి చెప్పవలసిన మాటలు వాళ్ళకు చెప్పడం.. అందరినీ ఒక కొలిక్కి తేవడానికి నేను పడిన శ్రమ.. ఇప్పుడు ఊరంతా ఒక్క మాట మీద నడవాలనుకోవడం– అదిగాగల విషయాలను– సర్పంచ్ నాయకుడికి వివరిస్తున్నాడు.

"ఈ పొద్దువొచ్చినాడు మొనగోడు... అదిగూడా మనం రమ్మంటే! మల్లా కనపడబొయ్యేది అయిదేండ్లయినాకనే గదా?

"అయ్యయ్యో! మీరలా అంటే ఎలా? నేను అందరి మాదిరి కాదు. ప్రజల మనిషిని నేను. చెప్పడం ఎందుకు? మీరే చూస్తారుగా?" నాయకుడు సంజాయిషీ చెప్పుకొంటున్నాడు.

"నలభై ఏండ్లుగా అందురూ ఇదేపాట పాడ్తానే ఉండారు. మేంవు ఇంటానే ఉండావు"

"ఇప్పుడీ కతలంతా ఎందుకు? ఊళ్ళో గుడికట్టించాలనుకున్నారు గదా? ఆ మాట మాట్లాడ్తే పోలా?"

"పార్టీలు మార్చే పరంబోకులు గుళ్ళూ గోపరాలు కట్టించబోతారు. మేంవు సూడబోతాం?" ఎవరో ఒక కుర్రకుంక నోరుజారాడు.

"రే! ఏం కూసినావురా?"

"కూసేది నీ బోటిగాడ్దిరా!"

"ఇంకొకసారి కుయ్‌రా ఆ మాట"

"ఒకసారి కాదురా వందసార్లంటా! పార్టీలుమార్చే పరంబోకు నాయాండ్లు- వాళ్ళా ఒక మణుసులేనా? అని!"

మాటతో కూడా కుర్రవాడి చెంప ఛెళ్ళుమనింది!

ఎంతో కష్టపడి అందరినీ ఒక గొడుగుకిందికి తెచ్చినాననుకొంటే- ఊహించని రీతిలో వాదోపవాదాల పెనుగాలి వీచింది. ఆ గాలికి గొడుగు లేచిపోయింది.

ఇటు ఒక వర్గం. అటు ఒక వర్గం. రెండువర్గాల చేతుల్లో కర్రలు. పాత కక్షల ప్రేరణ ఏమో మరి? రెండు వర్గాలు చెలరేగాయి. ఎవరి మీద ఏ కర్రదెబ్బో- పరిస్థితి పట్టు తప్పుతూ ఉంది. ఆ గుంపులో జొరబడి దెబ్బ పైన పడకుండా తప్పించుకొంటూ- ఆవేశపడుతున్నాను. అరుస్తున్నాను. కోపగించుకొంటున్నాను. బతిమాలుకొంటున్నాను. పరిస్థితిని అదుపులోకి తేవాలని విశ్వప్రయత్నం చేస్తున్నాను. అప్పుడు ఉన్నట్లుండి ఎవడిచేతి కర్రో పైకి లేచింది. నాయకుడి తలమీదపడబోతూంది. ఒక్క ఊపులో పొగరుబోతు పొట్టేలులా ముందుకు దూకాను. నాయకుణ్ణి పక్కకు నెట్టాను.

నాయకుడి తలమీద పడవలసిన దెబ్బ నాతలమీద పడింది. రక్తం చిమ్ముతూ ఉంది.

ఆ వర్గంలో కొంతమంది రక్తం... ఈ వర్గంలో కొంతమంది రక్తం కలగలిసి పుడమి తల్లి గుండెల్ని తడిపితే ఊరు మేలుకొనింది. అప్పుడు పరిస్థితి అదుపులోకి వచ్చింది.

నాయకుడు అందరికీ నమస్కరించి కారు ఎక్కాడు.

తలకు కట్టుతో నేను అతని ప్రక్కన కూర్చున్నాను. కారు ఊరుదాటింది. నాయకుడు నా రెండు చేతులు పట్టుకొన్నాడు. చేతులు కాదు కాళ్ళు అన్నాడు. చర్మాన్ని చెప్పులు కుట్టి ఇచ్చినా ఋణం తీరదన్నాడు. భవిష్యత్తులో గీతగీస్తే దాటనన్నాడు.

అంతా వింటూ కూర్చున్నాను!

తలకుకట్టు అలంకారంగా నా కలాన్ని గళాన్ని నాయకుడి విజయానికి తలకట్టుగా ఉపయోగించాను- స్వార్థానికి అతీతంగా... పార్టీ ప్రతిష్ఠ ధ్యేయంగా... చిత్తశుద్ధి పెట్టుబడిగా!

ఓటమిని రుచిచూసిన ప్రత్యర్థి తలెత్తలేదు!

అటువంటప్పుడు నా పక్షాన- కాదు న్యాయం పక్షాన నిలబడమంటే నిలబడడా?

ఎందుకు నిలబడడు?

అందుకే అతని ముందునిలబడ్డాను!

"చూడండి. ఎంత అన్యాయానికి పాల్పడ్డారో ఆలోచించండి. మా వేలితో మాకన్నే పొడిచినట్లు చేశారు కదా? ఇదేమైనా బాగుందా? వాళ్ళమనిషిని మా గ్రూపులో ఉంచడం

ఏమిటి? వాడు తనకన్నా నమ్మకస్థుడు లేనట్లు నటించడం ఏమిటి? సమయం సందర్భం కలిసిరాగానే వద్దంటున్నా కద్దన్నట్లు కాలుదువ్వడం ఏమిటి? అమాయకుల్ని బలిచెయ్యడం ఏమిటి? అన్యాయానికి కూడా ఒక హద్దుండాలికదా? చీమకైనా చెడుతలంపని మంచిమనిషి విశ్వనాథం. ఆ సంగతి ఊళ్ళో అందరికీ తెలుసు. మీకూ తెలుసు. అధికారం మీ చేతుల్లో ఉందని చేయని నేరాన్ని అతనిపై మోపి అరెస్టుచేయిస్తారా? ఇదేనా ప్రజాస్వామ్యంలో ఎన్నికల తీరు? దీనిని మీరూ సమర్థిస్తున్నారా? మీ అభిమానిగా అర్థిస్తున్నాను. మీరు న్యాయం పక్షాన నిలబడండి".

నాయకుడు చెప్పినదంతా శ్రద్ధగా విన్నాడు.

ఆ తర్వాత తలపంకిస్తూ ఓ రాజకీయనవ్వు నవ్వాడు!

"సోదరా! నామీద మీకున్న అభిమానం వెలకట్టలేనిది. ఎన్నికలప్పుడు స్వయంగా చూశాను కదా! ఇక నాసంగతంటారా? నా నియోజకవర్గంలో కులమత పార్టీ రహితంగా ప్రతి ఒక్కరి మీద నాకు అభిమానం ఉంది. మరీ మీమీదైతే అది ప్రత్యేకం. నా ప్రజలకోసరం నేనేమీ చేయడానికైనా సంసిద్ధం. అయితే మీకు తెలియదని కాదు అభిమానం వేరు. రాజకీయం వేరు గదా?"

చాచి చెంపన కొట్టినట్లయింది. తలవాలిపోయింది. వంచిన తలెత్తలేకుండా నడుస్తున్నాను.

నడకతో కలిసి ఆలోచనలు!

'ఏమన్నాడు? రాజకీయం వేరు. అభిమానం వేరా? కదామరి? ఎంతగొప్పమాట. అతడు రాజకీయ నాయకుడు కావడానికి నాఅభిమానం అవసరమయింది. అతగాడిఅభిమానం నాకు అవసరమయ్యేటప్పటికి రాజకీయం అడ్డువచ్చింది.

ఔరా! రాజకీయ హంసలారా!

ఎన్నికల సమయంలో రాజకీయాన్ని అభిమానాన్ని కలబోయడం మీవంతే!

ఎన్నికలు అయిపోతూనే రాజకీయాన్ని అభిమానాన్ని దేనికదిగా వేరుచేయడం మీవంతే!

హంసలు పాలను నీటిని వేరుచేస్తాయట! ఎవరు చూశారో ఏమో? కానీ రాజకీయ హంసలు మాత్రం రాజకీయాన్ని అభిమానాన్ని వేరుచేయడం ప్రత్యక్షంగా చూస్తున్నాము. ఫలితాన్ని అనుభవిస్తున్నాము.

రాజకీయ హంసలూ! జిందాబాద్!!- అని మనసు జైకొడ్తూ ఉంటే నుదుటి మీద మాయని మచ్చ మనసారా నవ్వుకొనింది! ●

ఆంధ్రభూమి
(11, అక్టోబరు 1990)